క్లుప్తంగా

పింఛను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి: ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పట్టణంలోని 31వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల గృహాలకు వెళ్లి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక రోజు ముందుగానే డిసెంబర్ పింఛను కూటమి ప్రభుత్వం అందించిందన్నారు. రెండు నెలల పాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయినా మూడో నెలలో మొత్తాన్ని ఒకేసారి చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తురకా మేరిగ్రేస్ ఉన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు అభినందన



తాడికొండ: ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రంగాల్లో తమ కళాశాల అధ్యాపకుల కృషికి ఏఐ, ఎంతః ఆర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేసినట్లు మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన అధ్యాపకులు డాక్టర్ వి.వి.సుబ్బారావు, డాక్టర్ పి.బాల మురళీకృష్ణ, డాక్టర్ డి.కల్యాణ్ కుమార్, డాక్టర్ బి.తులసిరాణి, డాక్టర్ డి.రవికిరణ్, ఎస్.శాంతిప్రియ, జి.రామచంద్రరావు, ఆర్.హెచ్.నాయక్, ఎన్.శ్రీకాంత్, ఎస్.శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌బాషా, పి.సుస్మిత వదన, పి.శ్రీవిద్య, జి.గీతలను అభినందించారు. విద్యా సంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. అకడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంపీడీఓకు సన్మానం



క్రోసూరు: ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు శనివారం పదవీ విరమణ చేశారు. స్థానిక షాదీఖానాలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు, ఉద్యోగులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శిఖా శ్యాంసన్, ఈవోఆర్పీఆర్డీ జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకు అదృశ్యంపై ఫిర్యాదు



క్రోసూరు: దొడ్లేరు గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి బైరెడ్డి శివన్నారాయణరెడ్డి ఈ నెల 25 నుంచి కనబడటం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కె.నాగేంద్రరరావు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. నరసారావుపేటలోని వాగ్దేవి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం శివన్నారాయణరెడ్డి తన తాత పెద కర్మ సందర్భంగా దొడ్లేరుకొచ్చి, కళాశాలకు ఆర్టీసీ బస్సులో వెళ్లినట్లు తెలిపారు. ఈ రోజు వరకు ఆచూకి తెలియరాలేదని ఫిర్యాదు పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వారు 94407 96235, 08640-227133 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్



క్రోసూరు: క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ టి.తులసి, సిబ్బంది శనివారం అచ్చంపేట మండలం తాడువాయి గ్రామంలో దాడులు నిర్వహించారు. నాటు సారా విక్రయిస్తున్న మహిళ భూక్యా ఆదిలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి రెండు లీటర్ల నాటు సారా క్యాన్‌ను స్వాధీన చేసుకున్నారు. సత్తెన్నపల్లి కోర్టులో నిందితురాలిని హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నాటు సారా తయారీ, విక్రయాలపై 83092 25378 నంబరుకు సమాచారం అందించాలని తెలిపారు.

93 శాతం పింఛన్ల పంపిణీ

ముప్పాళ్ళ: మండలంలోని 93 శాతం పింఛన్ల పంపిణీ శనివారం పూర్తయిందని ఎంపీడీవో పి.జె.విలియమ్స్ తెలిపారు. సచివాలయాల సిబ్బంది మొత్తం 6,118 లబ్ధిదారులకు గాను 5,727 మందికి సాయం అందించారని వెల్లడించారు.

అంతిమ సంస్కారంలో అసౌకర్యాలు



అచ్చంపేటలోని హిందూ శ్మశానం



ఆరు బయటే దహన సంస్కారం

- హిందూ శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కరువు
- అంత్యక్రియలకు అచ్చంపేట ప్రజలకు తప్పని ఇబ్బందులు
- వర్షం వస్తే.. దహన సంస్కారాలకు ఆలస్యం
- అధికారులు పట్టించుకోవాలంటున్న స్థానికులు

అచ్చంపేట: మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటికలో కనీస సౌకరాలు కరువయ్యాయి. శ్మశానం మొత్తం పిచ్చి మొక్కలు, గుంతలు పడి ఉంది. దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శవాల దహనానికి షెడ్డు, కర్మకాండలకు ఒక గది కూడా లేదు. గ్రామంలోని వ్యర్థాలను ఇక్కడే పడేస్తున్నారు. 15 వేల జనాభా కలిగిన అచ్చంపేట పంచాయతీకి అన్ని సౌకర్యాలతో శ్మశానం లేకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

వర్షాలొస్తే.. అంతే సంగతి

శవాల దహనానికి ప్రత్యేకంగా శ్మశానంలో ఒక షెడ్డు లేకపోవడంతో.. వర్షాలు పడినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందుకు పరిష్కారంగా షెడ్డు, అందులో ఒక ప్లాట్ ఫాం ఏర్పాటు చేసి, అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే విధంగా రెండు ఐరన్ ఫ్రేమ్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే వర్షం పడితే.. తగ్గే వరకు దహనానికి వేచి ఉండాల్సి వస్తోంది.

సౌకర్యాలు కల్పించండి..

శ్మశానం రెండు ఎకరాల్లో ఉంది. ఒక వైపు శవదహనం, మరో వైపు ఖననానికి సౌకర్యాలు కల్పిస్తే.. ఆచార వ్యవహారాల ప్రకారం అంతి సంస్కారాలు చేసుకునేందుకు వీలుంటుంది. కార్యక్రమం పూర్తవగానే స్నానాలు చేసేందుకు వసతులు కల్పించాలి. హిందు శ్మనానికి కర్మకాండలు నిర్వహించుకునే రెండు గదులు, అందులో అస్తికలు భద్రపరచుకునేందుకు ఒక లాకర్ సదుపాయం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్ని రోజుల తర్వాత కాశీ, దగ్గరలోని నదిలో అస్తికలు కలిపేందుకు వీలుంటుంది.

ప్రభుత్వం స్పందించాలి

హిందూ శ్మశానంలో కర్మకాండలకు సౌకర్యాలు మెరుగుపరచాలి. ఈ బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దహన సంస్కారానికి షెడ్డు నిర్మించి, రెండు ఐరన్ ఫ్రేమ్స్ ఏర్పాటు చేయాలి. అస్తికలను భద్రపరచుకునేందుకు లాకర్లతో కూడిన గదిని నిర్మించాలి. ఇందుకు రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయాలి.

– చలువాది అప్పారావు,
అధ్యక్షుడు, హరిహర క్షేత్రం

హెచ్ఐవీపై అవగాహన అవసరం

సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండ్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా మందులు అందిస్తున్నామని, వారికి మెరుగైన సేవలను ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అందిస్తోందని తెలిపారు. సామాజిక స్పృహతోనే హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని శృంగారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సింగ్ సూపరిండెంట్ రాధ, ఐసీటీసీ కౌన్సిలర్ జి.రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ మహబూబ్ సుభాని, హాండ్స్ ఆఫ్ కాంపోసిషన్ సిబ్బంది, ఐసీటీసీ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, రాధ

ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తాం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ... పట్టణంలోని 8,9,10,14,15 వార్డుల్లో వాటర్ పైపులైన్ పనులు చేపట్టడం జరిగిందని, పైపులైన్‌లు పూర్తయిన తర్వాత ఆయా వార్డులలో కృష్ణా నీటిని ప్రజలకు అందించటం జరుగుతుందని తెలిపారు. అలాగే పట్టణంలోని పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తిగా నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. అనంతరం పలువురు వార్డు కౌన్సిలర్లు ఆయా వార్డులలో సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

స్వచ్ఛ మాచర్లగా మార్చేందుకు కృషి

మాచర్ల: పట్టణాన్ని స్వచ్ఛ మాచర్లగా మార్చేందుకు కౌన్సిల్‌తో పాటు అధికారుల సహకారం అవసరమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. పురపాలక సంఘ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ నరసింహారావు అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా మొత్తం 20 అంశాలపై చర్చ జరగ్గా కూరగాయల మార్కెట్‌కు సంబంధించిన అద్దెల పెంపు అంశం మినహా మిగతా అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కాంప్లెక్స్ సంబంధించి అద్దెలకు ఇచ్చే విషయంలో ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి చర్చించి నిర్ణయం తీసుకోవాలని కౌన్సిలర్ సుభాని కోరారు. పట్టణంలోని సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించక పోగా కౌన్సిలర్లను నిర్లక్ష్యంగా చూస్తున్నారని సుభాని, ఎం.శ్రీనివాసరావులు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కమిషనర్ డి.వేణుబాబు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో మున్సి పల్ చైర్మన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి ఆయా వార్డు కౌన్సిలర్లకు ప్రాధాన్యత నివ్వటంతో పాటు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. హౌసింగ్ లోన్లకు సంబంధించిన అంశంపై గృహ నిర్మాణశాఖ డీఈ బాలాజీ నాయక్, హౌసింగ్ స్కీం వివరాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమావేశానికి దూరంగా ఉన్నారు. పురపాలక సంఘ డీఈ సుభాని, ఆర్ఐ వెంగయ్య, ఉద్యోగి రాజా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ పోలూరి

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

గురజాల: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టు భవనాల నందు శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురజాల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆర్.శరత్ బాబు సూచనల మేరకు పలువురు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పెండింగ్‌లో వున్న రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుని కక్షిదారులకు అవగాహన కల్పించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా పోలీస్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగమణి, న్యాయవాదులు షేక్ జానీబాష, సుందర జ్ఞానమ్మ, కలివెల ప్రభుదాసు, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

సత్తెనపల్లి: విజిలెన్స్ అధికారులు పట్టణంలోని రెండు దుకాణాలపై శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లు కమర్షియల్‌గా దుకాణాల్లో వినియోగిస్తుండటంతో విజిలెన్స్ సీఐ శివాజీ ఆధ్వర్యంలో వివిధ వ్యాపార దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ దాడుల్లో రెండు దుకాణాల్లో ఏడు సిలిండర్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై 6ఏ కేసులు నమోదు చేశారు. దాడుల్లో ఇన్‌చార్జ్ ఆర్ఐ బోస్‌బాబు, వీఆర్వోలు అరుణ, నరసింహారావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: తాడికొండ వద్ద 220కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం మండల పరిధిలోని ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ పి.రవికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరు సబ్ స్టేషన్ పరిధిదిలోని ఉంగుటూరు, లేమల్లె, కర్లపూడి, మండెపూడి నెమలికల్లు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

దంచికొట్టిన వర్షం

రాజుపాలెం: మండలంలో శనివారం సాయంత్రం అకాల వర్షం పడడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంట కోతకు వచ్చే సమయంలో వర్షం పడడంతో నేల కొరగడం, కోసిన పంట కుళ్లి పోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పత్తి తీసే సమయంలో వర్షం పడడంతో పత్తి వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ ఏడాది వరుసగా తుఫాన్‌లు రావడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు పడడంతో ఆందోళన చెందుతున్నారు.

121 కలశాలతో అభిషేకం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణ సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారికి 121 కలశాలతో శనివారం విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్వామివారి లక్ష బిల్వార్చన వేడుకల్లో భాగంగా అభిషేక ప్రియుడైన స్వామివారికి 9రకాల విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. చండీపారాయణం, రుద్రహోమం, చండీహోమం, అమ్మవారికి కుంకు మపూజలు చేశారు. పలుగ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. విశేష అలకంరణలో స్వామివార్లను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.

కస్టమర్ కేర్ కోర్సుకు శిక్షణ

క్రోసూరు: ఏపీఎస్ఎస్‌డీ ఆధ్వర్యంలో క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు నెలల కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ సర్టిఫికెట్ కోర్సుకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమాదేవీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సు అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని 10వ తరగతి, ఆ పైన చదువుకుని 15 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు బాపతు అంజిరెడ్డి 94949 86164 ని సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల వసతిగృహంలోని విద్యార్థులకు హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ఉచితంగా దంత వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. తొలుత గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సరైన దంత విధానంతో ఆరోగ్యకరంగా జీవించగలుగుతామని తెలిపారు. అంతేకాకుండా పంటి నొప్పి వలన ఏకాగ్రత తగ్గుతుందని, ఎప్పటికప్పుడు పళ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. శ్రీ సాయి కృష్ణ డెంట్ కేర్ వైద్యులు శివరామకృష్ణన్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వనజ, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు, శ్రీలత హస్పటల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

జేసీ చొరవతో సమస్య పరిష్కారం



కుల ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నాగరాజు

సత్తెనపల్లి: మూడు దశాబ్దాల మాదిగ దాసు కుల ధృవీకరణ పత్రం సమస్య జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే చొరవతో పరిష్కారం అయ్యింది. ప్రగతి మాదిగ దాసు సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంకాళ్ళ నాగరాజు ఈ విషయాన్ని వెల్లడించారు. తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి నుంచి శనివారం కుల ధ్రువీకరణ పత్రం అందుకున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగరాజు మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా మాదిగ దాసు కుల ధ్రువీకరణ పత్రం ఆర్డీఓ జారీ చేస్తున్నారన్నారు. దీంతో కుల ధృవీకరణ పత్రం పొందేందుకు తీవ్ర జాప్యంతో పాటు అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో 2019లో ప్రభుత్వం సమస్య పరిష్కారంలో భాగంగా జీవో ఎంఎస్ నెంబర్ 58 విడుదల చేసిందన్నారు. ఈ జీవో ప్రకారం మాదిగ దాసు కులానికి ఆర్డీఓ కాకుండా తహసీల్దార్ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని జీవోలో ఉందన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఈ జీవో 58 అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారన్నారు. ఈ క్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యను, అధికారుల నిర్లక్ష్యం అంశాలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లగా విచారించి సంబంధిత అధికారులకు సమస్య పరిష్కరించేందుకు ఆదేశించారన్నారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు జీవోను అమలు చేస్తూ మాదిగదాసు కుల ధ్రువీకరణ పత్రం తహసీల్దార్ జారీ చేశార న్నారు. తమ సమస్య పై తక్షణమే స్పందించిన జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ వెన్నంటి ఉండి సహకారం అందించిన డీబీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్పకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సర్దుబాటు చార్జీల భారం ఉపసంహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెండ్యాల మహేష్, నాయకులు

సత్తెనపల్లి: విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రజలకి వాగ్దానం చేశారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చిన వెంటనే సర్దుబాటు చార్జీల భారం మోపడం సరికాదన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం రూ.20 వేలు విడుదల చేయాలని కోరారు. గతేడాది పంట నష్ట పోయిన రైతుల బీమా పరిహారం వెంటనే చెల్లించాలన్నారు. గతంలో వ్యవసాయ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని పిలుపునిచ్చిన మంత్రి నారా లోకేష్..అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే చూస్తూ ఉన్నారని మండిపడ్డారు. ఏఎస్‌యూ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య కేసును కూటమి ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే కొట్టేయడం విచారకరమన్నారు. ఈ సంఘటలో దోషులను కూటమి ప్రభుత్వం రక్షిస్తుందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయన్నారు. పార్టీ మండల కమిటీ సభ్యులు మక్కపాటి నరసింహారావు, బొల్లెపల్లి రామారావు, జమ్మలమూడి భగత్, బత్తుల శివయ్య, రావూరి పూర్ణచంద్రరావు ఉన్నారు.

లక్ష్మీనారాయణ మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న ఎంపీపీ పద్మా

బెల్లంకొండ: మండలంలోని మాచాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు రామన బోయిన లక్ష్మీనారాయణ మృతి పార్టీకి తీరని లోటు అని ఎంపీపీ చన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం లక్ష్మీనారాయణ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పార్టీ నాయకులతో కలిసి ఎంపీపీ నివాళులర్పించారు. గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున లక్ష్మీ నారాయణ చురుకుగా పని చేసేవాడని తెలిపారు. కుమారుడు ఆదినారాయణ ప్రస్తుతం గ్రామ సర్పంచిగా ఉన్నారు. నివాళులర్పించిన వారిలో మండల నాయకులు చింతారెడ్డి సాయి రెడ్డి, సర్పంచ్ లు కంభంపాటి పాప, నరసింహ నాయక్, రమణారెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

కొండ ప్రాంతంలో మృతదేహం కలకలం

అమరావతి: మండల పరిధిలోని కర్లపూడి – చావనాడు గ్రామాల మధ్య కొండ ప్రాంతంలో ఛిద్రమైన మృతదేహాన్ని శనివారం గొర్రెల కాపరులు గుర్తించటం కలకలం రేపింది. పోలీసుల సమాచారం ప్రకారం శనివారం గొర్రెల మేపుకోవడానికి వెళ్లిన కాపరులు సుమారు 50 సంవత్సరాలపైన వయస్సు ఉన్న పూర్తిగా ఛిద్రమైపోయిన పురుషుడి మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి సీహెచ్‌సీకి తరలించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ నిక్కరు, చొక్కా ధరించిన మృత దేహం, నెరసిన జుట్టు కలిగిన పురుషుడి మృతదేహంగా గుర్తించినట్లు చెప్పారు. మరణించి 20 రోజుల పైనే అయి ఉండొచ్చని తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేదలకు అన్నదానం అభినందనీయం

పట్టణ ఎస్ఐ సంధ్యారాణి



పేదలకు అన్నదానం చేస్తున్న పట్టణ ఎస్ఐ సంధ్యారాణి, మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల: పట్టణంలోని నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించటం ఎంతో అభినందనీయమని, ఇందుకు కారకులైన శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి సేవలు ప్రశంసనీయమని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి అన్నారు. శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్, నెహ్రూనగర్, బస్టాండ్, రింగురోడ్డు, చెన్నకేశవ దేవాలయం ప్రాంతంలో పేదలతో పాటు పలువురికి అన్నదాన కార్యక్రమాన్ని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ సంధ్యారాణి పలు చోట్ల స్వయంగా పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పేదవారిని ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. పట్టణంలోని 200 మంది పేదలకు అన్నదానాన్ని రెండు పూటలా నిర్వహించారు.

పాలువాయిలో వరిపంట కోత ప్రయోగం

ఎకరాకు 45 బస్తాల దిగుబడి



రెంటచింతల: మండలంలోని పాలువాయి గ్రామంలో శనివారం పంట కోత ప్రయోగం చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పిన్నమనేని సావిత్రమ్మ సాగు చేస్తున్న వరిపొలంలో ఈ ప్రయోగం చేపట్టినట్లు వెల్లడించారు. పొలంలో 25 చదరపు మీటర్ల పరిధిలో ఈ ప్రయోగం (నూర్పిడి) చేయగా సుమారుగా 45 బస్తాల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. వివిధ గ్రామాలలో రబీలో వరి పంటను సాగు చేస్తున్న రైతులు ఎకరాకు రూ. 680 ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.